క్లుప్తంగా

ముళ్లపొదల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు : మండల పరిధిలోని గుడెప్పాడ్ జంక్షన్ నుంచి మండల కేంద్రం వరకు జాతీయ రహదారిపై ముళ్లపొదలు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం సాక్షి దినపత్రికలో 'హైవేను కమ్మేస్తున్న ముళ్లపొదలు' అనే కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన ఆత్మకూరు సీఐ సంతోశ్ సిబ్బందితో కలిసి ముళ్లపొదలను జేసీబీతో తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షికి, స్పందించిన సీఐ సంతోశ్‌కు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

పరకాల : డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి పరకాల స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కొప్పుల శంకర్ ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. పట్టణ సమీపంలో ఈనెల 3న వాహనాల తనిఖీ చేస్తుండగా మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపూర్‌కు చెందిన పేర్వాల రమేశ్‌తో పాటు మరో 14 మంది మద్యం తాగి పట్టుబడినట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు. వీరిలో పేర్వాల రమేశ్‌కు జైలు శిక్ష విధించిన జడ్జి.. మిగతా వారికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయాలి



నడికూడ : ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన ఆన్‌లైన్ ఓటరు లిస్ట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హుల గుర్తించి ఓటరు జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ విమల సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పరకాల : మున్సిపాలిటీ ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తున్న మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ సుష్మ సూచించారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఏపుగా పెరిగిన తుమ్మపొదలను జేసీబీ ద్వారా తొలగింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. జవాన్‌లు సాంబరాజు, సతీష్, జర్నలిస్టులు రాజు, సురేందర్, రాజ్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేదిలేదు



వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శలు చేస్తే సహించేదిలేదని యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉండి మండలానికి సాగునీరు తీసుకురాలేని మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాదయాత్ర చేస్తానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వేలేరు మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, నాయకులు ప్రశాంత్, అరవింద్, సలీంమాలిక్, ఆరీఫ్, శ్రీకాంత్, అజయ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పరకాల : పేదల సంక్షమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎస్సీ విభాగం ఉమ్మడి పరకాల మండల అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు కోడెపాక లావణ్య ఇంటి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించగా ఆయన హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. పరకాల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మాజీ కౌన్సిలర్ సంపత్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

మూగజీవాలకు మందుల్లేవ్..!



- రెండేళ్లుగా నిలిచిన సరఫరా
- ప్రైవేట్ మెడికల్ షాపుల నుంచి రైతుల కొనుగోళ్లు
- దృష్టిసారించని అధికారులు
- మండలంలో 66,469 పశువులు



మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి

ఐనవోలు : మండలంలోని మూగ జీవాలకు అవసరయ్యే మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లుగా ప్రభుత్వం నట్టల నివారణ మందు, విటమిన్ ట్యాబ్లెట్‌లు పంపిణీని నిలిపివేయడంతో పశువుల ఆస్పత్రుల్లో మందులు కరువయ్యాయి. దీంతో పెంపకం దారులు ప్రైవేటుగా కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

మండలంలో 66,469 పశువులు

మండలంలో గొల్ల, కురుమ సామాజిక వర్గంతో పాటు ఇతరులు సైతం గొర్రెలు, మేకలను పెంచుకుంటున్నారు. పశువైద్యాధికారుల అంచనా మేరకు మండలంలో 66,469 మూగజీవాలు ఉన్నాయి. అందులో 2,936 మేకలు, గొర్రెలు 54,201, ఆవులు 3,352 , ఎద్దులు 5,495, బర్రెలు, పందులు 485 ఉన్నట్లు అంచనా వేశారు.

సంక్రమించే వ్యాధులు

ప్రతి వర్షాకాలం ప్రారంభంలో పశువులు సహజంగానే వ్యాధుల బారిన పడుతుంటాయి. గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు, గురక, మశూచి తదితర వ్యాధుల బారిన పడుతుంటాయి. వీటితో పాటు జ్వరం, అరుగుదల లేకపోవడం, గాయాలు, నోటిలో పుండ్లు ఏర్పడటం, ఎదకు రావడం, ఇతర అనారోగ్య సమస్యలకు మందులు అవసరం కానున్నాయి. కానీ మండలంలోని పశువైద్యశాలలో మందులు అందుబాటులో లేనికారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిలిచిన మందుల సరఫరా

ప్రభుత్వ పశువుల ఆస్పత్రుల్లో వివిధ రకాల టీకాలతో పాటు నట్టల నివారణ మందు, విటమిన్ ట్యాబెట్లు గతంలో ఏడాదిలో మూడుసార్లు పంపిణీ చేసేవారు. దీంతో జీవాల శరీరంలో నట్టలు నివారణ జరిగి ఆరోగ్యంగా, బలంగా ఉండేవి. దీంతో పెంపకందారులకు గిట్టుబాటు లభించి లాభాలు పొందేవారు. రెండేళ్లుగా ప్రభుత్వం మందుల పంపిణీ నిలిపివేయడంతో మూగజీవాల యజమానులు ప్రైవేటు మెడికట్ షాపులను ఆశ్రయించి కొనుగోలు చేస్తూ ఆర్థికభారం మోస్తున్నారు. ఒక్కసారి మూగజీవాలకు మందు పట్టించేందుకు రూ. 2వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఏడాదికి మూడుసార్లు మందు తాగిస్తేనే జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యులు చెబుతున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నట్లు పెంపకందారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మూగజీవాలకు అవసరమయ్యే మందులు, టీకాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

జాడలేని అవగాహన సదస్సులు

పశువులకు సంక్రమించే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గతంలో పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేవారు. క్రమ క్రమంగా సదస్సుల జాడ కనుమరుగవుతుందని పశుపోషకులు వాపోతున్నారు. వ్యాక్సిన్లు వేసే సమయంలో అక్కడకు వచ్చే రైతులకు మాత్రమే అధికారులు ఒకటి, రెండు సూచనలు చేసి చేతులు దులుపుకొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పశువులకు వచ్చే వ్యాధుల గురించి రైతులకు అవగాహన లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి.

ప్రైవేట్‌గా కొంటున్నాం

పశువుల ఆస్పత్రికి ఎప్పుడు వెళ్లిన నట్టల నివారణ మందు లేదని చెబుతున్నారు. దీంతో మూగజీవాల పెంపకందారులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. పశువుల ఆస్పత్రి ఉన్నప్పటికీ మందులు మాత్రం అందుబాటులో లేవు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉంచాలి.

- చిన్నరాజు, జీఎంపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి, ఐనవోలు

మందులు త్వరలో వస్తాయి

గత నెలలోనే బాధ్యతలు స్వీకరించాను. నట్టల మందు కావాలని రైతులు రెండుసార్లు అడిగారు. గతంలో మాదిరి కాకుండా ప్రాసెస్ మారడంతో మందులు రావడం ఆలస్యం అవుతుంది. కావాల్సిన మందుల ఇండెంట్ పంపించాం. 20 రోజుల్లో మందులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి సరఫరా కాగానే రైతులకు మందులు పంపిణీ చేస్తాం. ప్రస్తుతం పశువులకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

- శరత్ కుమార్, మండల పశువైద్యాధికారి

చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



శాయంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు .గురువారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం (పీఐసీ) అధ్యక్షుడు మామిడి శంకర్ లింగం అధ్యక్షతన నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. భారతదేశ సంస్కృతిక వారసత్వానికి సింబల్‌గా నిలిచే చేనేత గుర్తుగా దేశ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించడం గర్వకారణమన్నారు. మానవ నాగరికతలో చేనేతకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి వహిస్తోందన్నారు. చేనేత కార్మికుల పాత బకాయిలు విడుదల చేయడంతో పాటు లక్ష వరకు రుణాలు మాఫీ చేసినట్లు గుర్తుచేశారు. నేత కార్మికుల సమగ్రాభివృద్ధికి తెలంగాణ చేనేత అభయహస్తం పథకం, తెలంగాణ నేతన్నకు భరోసా వంటి వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ చేనేత కార్మికులను ఆయన శాలువాతో సత్కరించారు. చేనేత సంఘం పాలకవర్గ సభ్యులు, పద్మశాలి సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని రక్షించుకోవాలి

కమలాపూర్ : చేనేత రంగాన్ని రక్షించుకోవాలని మండలంలోని చేనేత కార్మికులు పిలుపునిచ్చారు. కమలాపూర్ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి 'చేయి చేయి కలుపుదాం-చేనేతకు చేయూతనిద్దాం, చేనేత వస్త్రాలను ధరిద్దాం- చేనేత కళా రంగాన్ని ప్రోత్సహిద్దాం , చేనేత కార్మికులకు పని కల్పించాలి, చేనేత కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' అని నినాదాలు చేశారు.

నులి పురుగులను నివారించాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

కమలాపూర్ : నులి పురుగులను నివారించేందుకు ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తినిపించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు సూచించారు. ఈనెల 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో నులి పురుగులు ఉండటం వలన పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం వంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని అన్నారు. తద్వారా చదువుపై ఏకాగ్రత కోల్పోతారన్నారు. ఏన్నో ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున పిల్లల్లో ఈ సమస్య చాలా తగ్గిందన్నారు. అయినప్పటికీ పిల్లలకు తప్పనిసరిగా అల్బెండాజోల్ మాత్రలు తినిపించాలని, అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని, బడి బయటి పిల్లలకు కూడా ఈ మాత్రలు తినిపించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తను అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. అల్బెండాజోల్ మాత్రలతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తయని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గుండె బాబు, పల్లె దవాఖానా వైద్యులు అరుణ్, మాధవి, రేణుక, మానస, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- స్పెషల్ ఆఫీసర్ నవీన్‌కుమార్



పరిసరాలను పరిశీలిస్తున్న నవీన్‌కుమార్

నడికూడ : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్ సూచించారు. గురువారం మండంలోని ధర్మారం, నర్సక్కపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడా నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా కొనసాగించాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విమల, ఏపీఓ విద్యావతి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన పారిశుద్ధ్య కార్మికులు

ఆత్మకూరు : మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగను కలిశారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు వచ్చిన ఆయనను ఆత్మకూరు మండల పారిశుద్ధ్య కార్మికులు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మాట్లాడాలని వినతిపత్రం అందించారు.

దారి మళ్లింపు

ఆత్మకూరు : ములుగు జిల్లా మల్లంపల్లి సమీపంలో వంతెన కుంగడంతో అటువైపు వెళ్లే వాహనాలను గురువారం రాత్రి గుడెప్పాడ్ జంక్షన్ వద్ద సీఐ సంతోశ్ బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించారు. పరకాల నుంచి వెళ్లాలని వాహనదారులకు సూచించారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో గురువారం రక్షాబంధన్ నిర్వహించారు. విద్యార్థులకు చిన్నారులు రాఖీలు కట్టారు. పాఠశాల హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు నరసింహస్వామి, వసంత, కవిత పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

శాయంపేట : పరకాల మండలం నాగారం గ్రామంలో పద్మశాలి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న భక్త మార్కండేయస్వామి రథోత్సవానికి తరలిరావాలని పద్మశాలీలు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. భక్త మార్కండేయ స్వామి రథోత్సవానికి భక్తులు, పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పద్మశాలీలు లక్ష్మీనారాయణ, సుమన్, భిక్షపతి, చంద్రప్రకాశ్, నవీన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి

శాయంపేట : ఈనెల 11న వరంగల్‌లో చేపట్టే తెలంగాణ ఉద్యమకారుల మహా పాదయాత్రను జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : ఈనెల 20,21,22వ తేదీల్లో మేడ్చల్ జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేడ్కర్ చౌక్ వద్ద రాష్ట్ర నాల్గో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు రమాదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శి రమేశ్, నాయకులు కుమారస్వామి పాల్గొన్నారు.

డైరీ రాయడం అలవర్చుకోవాలి



డైరీలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : విద్యార్థులు డైరీ రాయడం అలవర్చుకోవాలని దైనందిని పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు పద్మజ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆమె డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకు సంబంధించిన విషయాలు, సూచనలు డైరీలో నిక్షిప్త పరుచుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్, ఉపాధ్యాయులు సురేష్, పద్మజ, రామకృష్ణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. స్టూడెంట్ ప్రొఫైల్, లీవ్ రికార్డ్, స్కూల్ సర్కులర్లు, ఫార్మేటివ్ అసెస్మెంట్, సమ్మెట్ అసెస్మెంట్, టైం టేబుల్ రోజువారి ఇంటి పనులు, ప్రాజెక్టు ఆధారిత పనులు తదితర అంశాలను విద్యార్థులు డైరీలో ఎలా నిక్షిప్త పరుచుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



శాయంపేట : మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



నడికూడలో..

శాయంపేట : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్లు సరిత, మధు, రేవతి అన్నారు. మండలంలోని కొత్తగట్టు సింగారంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ముర్రుపాలతో రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. బిడ్డకు తల్లిపాలు అమృతమన్నారు. తల్లిపాలకు మించిన పౌష్టికాహారం మరొకటి లేదన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం సాంబలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నడకూడ : పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ హేమలత సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరకాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్స్ అనిత, సంపూర్ణ, కళావతి, వినోద, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే 'పొలంబాట'



శాయంపేట : తీగలను సరిచేస్తున్న సిబ్బంది

శాయంపేట / నడికూడ : రైతులకు ఎదురైన విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే 'పొలంబాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు విద్యుత్‌శాఖ డీఈ సామ్యానాయక్ స్పష్టం చేశారు. గురువారం శాయంపేట మండలంలోని ఆరెపల్లి, నడికూడ మండలంలోని ముస్త్యాలపల్లిలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా 5చోట్ల వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేశారు. ప్రతినెల మొదటివారంలో వ్యవసాయ భూముల్లో వేలాడుతున్న తీగలను సరి చేయడం, ఒరిగిన విద్యుత్ స్తాంభాలను సరి చేయడం, ఇతర సమస్యలను పరిష్కరించడం పొలంబాట కార్యక్రమం ఉద్దేశమన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ దేవేందర్ నాయక్, ఏఈ చందూలాల్, సబ్ ఇంజినీర్ చొక్కారావు, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, లైన్‌మెన్ సోమ్లా, ఏఎల్ఎం విష్ణు, సాగర్, శ్రీకాంత్, రాజు, అన్‌మ్యాన్ ఆపరేటర్ మహేందర్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి పనులు ప్రారంభం



ఆలయ గేట్‌ను ప్రారంభిస్తున్న రాజుగౌడ్

కమలాపూర్ : మండలంలోని గుండేడులో భవిష్య సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆలయాల అభివృద్ధి పనులను స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి సంస్థ చైర్మన్ నాగపురి రాజుగౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు రూ.3 లక్షలు వెచ్చించి నిర్మించిన మడేలయ్య దేవాలయ ప్రహరీ, గేట్, ఆంజనేయస్వామి దేవాలయ ప్రహరీ, గేట్, దేవాలయ ఆవరణలో గచ్చు నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. తమ సంస్థ ద్వారా దేవాలయాల్లో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో గ్రామ అభివద్ధి కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని రాజుగౌడ్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి సేవా సంస్థ ముందుంటుందన్నారు. మాజీ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచులు తిరుపతిరావు, నాయకులు రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పంచలోహ విగ్రహం బహూకరణ



మహాలక్ష్మి అమ్మవారి పంచలోహ విగ్రహం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన అడ్వొకేట్ గట్ల విజయపాల్ రెడ్డి-సరోజన దంపతులు, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి దేవాలయానికి మహాలక్ష్మి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని బహూకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి గురువారం తెలిపారు. మహాలక్ష్మి అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని తమిళనాడులోని కుంభకోణం నుంచి రెండు ఫీట్ల విగ్రహాన్ని తెప్పించినట్లు తెలిపారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ట్రైసిటీస్ ఆధ్వర్యంలో రూ.5 వేల విలువచేసే బ్యాగులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ట్రై సిటీస్ అధ్యక్ష, కార్యదర్శులు, ఐనవోలు మండల పంచాయతీ అధికారి రఘుపతిరెడ్డి, పాఠశాల హెచ్ఎం రజిత, ఉపాధ్యాయులు శేషు, నరసింహారెడ్డి, ఆరోగ్యమ్మ, అశోక్, కుటుంబరావు, పారిజాతం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

శాయంపేట : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏబీఎస్ఎఫ్ నాయకుడు మంద నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల, కేజీబీవీ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని అన్నారు.

సీసీ ర్యాంపు నిర్మించాలి

పరకాల : శ్రావణమాసం సందర్భంగా బోనాల వేడుకలకు భక్తుల అధిక సంఖ్యలో తరలిరానున్నారని, పట్టణంలోని పోచమ్మ గుడికి భూపాలపల్లి ప్రధాన రహదారి నుంచి సీసీ రోడ్డు ర్యాంపు నిర్మించాలని మాజీ కౌన్సిలర్ పొరండ్ల సంతోశ్ కోరారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. వేలాది మంది తరలివచ్చే పోచమ్మ గుడికి భూపాలపల్లి రహదారి వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో భక్తులు, వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.